ప్రజాశక్తి

ఆదివారం 22 డిసెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

యూజిడికి మళ్లీ డిపిఆర్

పెరగనున్న అంచనాలు - నిధుల విడుదలపై అస్పష్టత



యుజిడి పనులు (ఫైల్)

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన భూగర్భ డ్రెయినేజి నిర్మాణ పథకం (యుజిడి) పనులు నిలిచిపోయి ఐదున్నరేళ్లు దాటింది. ఈ పనులను పూర్తికి మళ్లీ డిపిఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రజారోగ్యశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

2016లో రూ.930 కోట్ల అంచనాలతో భూగర్భ డ్రెయినేజి పనులు చేపట్టగా ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.540 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.310 కోట్లు, కార్పొరేషన్ వాటా రూ.80 కోట్లుగా పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులతో పనులు 50 శాతం వరకు పూర్తి చేశారు. 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం ఇంకా తన వాటా విడుదల చేయలేదు. అనంతరం ప్రభుత్వం మారడంతో రివర్సు టెండరింగ్ పేరుతో వైసిపి ప్రభుత్వం ఈ పనులను పూర్తిగా నిలిపివేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ పథకం పూర్తి చేయడంపై అధికారులు సమాచారం సేకరించారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో కూడా జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని ప్రస్తావించి పథకం పూర్తి చేయాల్సిన అవసరాన్ని చెప్పారు.

తక్షణం ప్రభుత్వం రూ.300 కోట్లను విడుదల చేస్తే పనులు పూర్తి చేయవచ్చునని తొలుత అంచనా వేసినా తాజాగా దాదాపు ఐదున్నరేళ్ల క్రితం పనులు నిలిపివేసినందున గతంలో చేపట్టిన పనులు నాణ్యత ఎలా ఉంది? అవి ఏ స్థాయిలో ఉన్నాయి? ఎంత వరకు ఉపయోగపడతాయి? కొత్తగా చేపట్టాల్సిన పనులపై నివేదిక రూపొందించాల్సి ఉంది. దీంతో మొత్తంగా ఈ ప్రాజెక్టును పునర్నిర్మాణం చేయాల్సి ఉన్నందున కొత్తగా డిపిఆర్ ▶ 2లో



మనుస్మృతి దహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అమిత్‌షా వ్యాఖ్యలు.. మోడీ చర్యలు..

- ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ఆగ్రహం
- 25న మనుస్మృతి ప్రతుల దహనానికి పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నో దేశాల రాజ్యాంగాలను చదివి, వాటిని అవపోశన పట్టి, ఆయా దేశాల్లో వాటి అమలను పరిశీలించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొన్ని పరిమితుల మధ్య భారత రాజ్యాంగాన్ని రూపొందించడమే కాకుండా దాన్ని దేశ ప్రజలు తమకుతామే అర్పించుకునేలా చేసిన మహోన్నత వ్యక్తి అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. ఆయన పేరును జపిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కుల నిర్మూలన పోరాట సమితి (కెఎన్‌పిఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ అధ్యక్షత వహించగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళల హక్కులను కాలరాస్తూ, నిమ్న ▶ 2లో



పథకాల వేగం పెంచండి

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రభుత్వ పథకాలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు జిల్లాలో సక్రమంగా అమలు జరిగేలా అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు తీరుపై ఆయన కలెక్టరేట్‌లో శనివారం సమీక్షించారు. ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, గ్రామ సడక్ యోజన, ప్రధాన మంత్రి అవాస్ యోజన అర్బన్, గ్రామీణ్, టిడ్కో ఇళ్ల నిర్మాణం, అమత్ పథకం , లఖ్ ▶ 2లో

పరిమళ అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి-తెనాలిరూరల్



ఇటీవల అమెరికాలో రోడ్డుప్రమాదంలో మృతి చెందిన నాగాశ్రీ వందన పరిమళ మృతదేహం శుక్రవారం రాత్రి తెనాలి నందులపేటలో ఆమె నివాసానికి తీసుకొచ్చారు. అమెరిక నుంచి ఢిల్లీ చేరుకున్న మృతదేహాన్ని శుక్రవారం అర్ధరాత్రి తెనాలి తెచ్చారు. కుటుంబీకులు, బంధువులు, స్థానికుల కన్నీటి రోధనల మధ్య శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి కుటుంబాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.



రూ.3 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

తెనాలిలో అభివృద్ధి పనులపై మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణంలో సువిశాల క్రీడా మైదానం ఏర్పాటుకు కసరత్తులు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. 1.76 ఎకరాల్లో రూ.3 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టబోతున్నామని, అందులోనే వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానిక జనసేన కార్యాలయంలో ▶ 2లో



హాస్టల్ సందర్శనలో అధికారులు, సిపిఎం నాయకులు

చీకట్లో కటిక నేలపై నిద్ర

అధికారులు, నాయకుల ఎదుట మోర్జంపాడు బీసీ హాస్టల్ విద్యార్థుల ఆవేదన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

చదువుకోవడానికి అనువైన పరిస్థితులు అటుంచి ఉండడానికే భయపడే పరిస్థితుల్లో తామున్నామని మాచవరం మండలం మోర్జపాడు బీసీ హాస్టల్ విద్యార్థులు ఆవేదనకు గురవుతున్నారు. హాస్టల్‌ను సిపిఎం నాయకులు, అధికారులు వేర్వేరుగా శనివారం సందర్శించి అక్కడి పరిస్థితులపై వివరాలు సేకరించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

సదుపాయాల లేమి, పాడైపోయిన భవనం, మొత్తంగా అధ్వాన పరిస్థితుల్లో బీసీ హాస్టల్ విద్యార్థులున్నారని సిపిఎం నాయకులు ఆవేదన వెలిబుచ్చారు. మాచవరం మండలం మోర్జపాడులోని బీసీ హాస్టల్‌ను సిపిఎం నాయకులు ▶ 2లో

కుడికాల్వ, పశ్చిమ డెల్టాకూ ఏకగ్రీవం

- ప్రాజెక్టు కమిటీల చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక పూర్తి
- కొత్తవారికి మంత్రి, ఎమ్మెల్యేల శుభాకాంక్షలు



సాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు పులుకూరి కాంతారావు, ఉప్పలపాటి చక్రపాణి, కృష్ణా పశ్చిమ డెల్టా కమిటీ చైర్మన్ పంతాని మురళీధర్, వైస్ చైర్మన్ నువ్వుల సునీల్ చౌదరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, తెనాలి రూరల్

నాగార్జునసాగర్ కుడి కాల్వ ప్రాజెక్ట్ కమిటీలకు చైర్మన్, వైస్‌చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించగా చైర్మన్‌గా పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్‌గా ఉప్పలపాటి చక్రపాణి ఎన్నికయ్యారని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ కృష్ణమోహన్ ప్రకటించగా ధ్రువపత్రాలను పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు అందించారు.

వీరి ప్రమాణస్వీకారోత్సవం స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, టిడిడి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్, కూటమి నేతలు రంగిశెట్టి రామకృష్ణ, కపలవాయి విజయకుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఎకరాకూ నీళ్లందేలా పర్యవేక్షించాలని, ప్రభుత్వానికి మంచిపేరు ▶ 2లో

555 సీసాల గోవా మద్యం స్వాధీనం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గోవా నుంచి గుంటూరుకు భారీగా ఎన్‌డిపి మద్యం తీసుకువస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు శనివారం తెలిపారు. మొత్తం ఆరుగుర్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు రకాలకు చెందిన 555 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానిక గోరంట్లలోని పట్టణ రెండో ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. నల్లపాడు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డుకు వచ్చే మార్గంలో తనిఖీ చేస్తుండగా గోవాకి చెందిన 180 మిల్లీలీటర్ల సీసాలు 123 తీసుకువెళ్తున్న ఒకర్ని అదుపులోకి తీసుకుని విచారించగా గుంటూరుకు చెందిన టంకశాల బాజీబాబు వద్ద నుంచి తీసుకున్నట్టు తెలిపారు. అతను తక్కువ ధరకు గోవా నుంచి తెచ్చినట్టు తెలిపారు. బాజీ బాబును గుర్తించి అదుపులోకి తీసుకోగా తాను మరో ముగ్గురు వ్యక్తులు కలిసి గోవా వెళ్లి మద్యం తెచ్చి విక్రయిస్తున్నట్టు అంగీకరించారు. వీరి ఇచ్చిన సమాచారంతో గోరంట్లలోని రవీంద్రనగర్‌లో ఒక భవనంలో ఉంచినట్టు కనుగొన్నారు. ఈ వ్యవహారంలో గుంటూరుకు చెందిన టంకశాల బాజీబాబు, వెంకమ శెట్టి మహేష్‌బాబు, కలసాని లక్ష్మారెడ్డి, రామిశెట్టి శ్రీనివాస్, తుమ్మ మంగమ్మను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మొత్తం 555 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో కూడా అనేక కేసులు ఉన్నాయని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. అరెస్టులో కీలకంగా వ్యవహరించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇ.మరయ్య బాబు, ఇన్‌స్పెక్టర్ బి.నారాయణ, సూపరింటెండెంట్ వి.అరుణకుమారిని డిప్యూటీ కమిషనర్ అభినందించారు.



సబ్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి సబ్ జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పార్థసారథి, జిల్లా కార్యదర్శి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గుంటూరు లీలావతి శనివారం సందర్శించారు. సబ్‌జైలులో పరిసరాలను పరిశీలించడంతోపాటు ఖైదీలతో మాట్లాడారు. ఆహారపదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పరిశీలనలో సత్తెనపల్లి రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్‌గౌస్, ప్యానల్ న్యాయవాది బి.ఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జక్కుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కెబిఆర్‌జె ప్రసాద్, కోశాధికారిగా కైపు రంగారెడ్డి, మరో 23 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. బొడ్డు రామారావు అధ్యక్షత వహించిన సభలో నూతన అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన వాటిని పోరాటాల ద్వారా సాధించుకుందామని చెప్పారు. అనంతరం 75 ఏళ్లు దాటిన పెన్షనర్ల దంపతులను సత్కరించారు. వీరిలో ఆర్.పురుషోత్తం, వి.బదిరినారాయణ, ఎస్.శివశంకరరావు, సౌరెడ్డి, ఎంఎం బాలసౌరి, ఫణిదెపు మాణిక్యమ్మ, తిరుపతి జ్ఞానానందం ఉన్నారు. రాష్ట్ర నాయకులు బి.వెంకటేశ్వర్లునూ సత్కరించారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎ.ప్రభుదాస్, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎం.రామారావు, పోతులూరయ్య, రామకోటయ్య, వెంకటాద్రి, మురహరి పాల్గొన్నారు.

ధాన్యాన్ని అమ్మేముందు పరీక్ష చేయించుకోండి

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలో 2400 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగైందని, ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో కోతలు ప్రారంభం కాగా మరికొన్ని గ్రామాల్లో కోత దశలో పంట ఉందని మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. రైతులు పంటను మద్దతు ధరకు రైతుసేవా కేంద్రాల్లోనే కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడంతోపాటు ఇకెవైసి పూర్తయిన వారు పంటను అమ్ముకోవడానికి రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. రైతులు ముందుగా ఒక కిలో ధాన్యాన్ని రైతుసేవా కేంద్ర కేంద్రానికి తీసుకెళ్లి తేమ, ఇతర నాణ్యత ప్రమాణాలను పరీక్ష చేయించుకోవాలని సూచించారు. తేమశాతం 17కు మించి ఉంటే ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. రైతులు గోనె సంచులు, హమాలీలు, రవాణాను సొంతంగా ఏర్పాటు చేసుకుంటే 40 కిలోల ఒక గోనె సంచికి రూ.3.39, క్వింటాళ్‌కు హమాలీ కూలి రూ.17.17, రవాణా ఛార్జీలు స్థానికంగా నిర్ణయించిన రేట్లు ప్రకారం ధాన్యం సొమ్ముతో కలిపి ప్రభుత్వమే ఇస్తుందని తెలిపారు. 75 కిలోల ధాన్యం సాధారణ రకమైతే రూ.1720, 'ఎ' గ్రేడ్ అయితే రూ.1740 చొప్పున మద్దతు ధర దక్కుతుందని, క్వింటాళ్ లెక్కన అయితే రూ.2300... రూ.2320గా ఉందని వివరించారు.

ప్రజాశక్తి-ఈపూరు : ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు సూచించారు. మండలంలోని కొచ్చర్లలో ధాన్యం కొనుగోలును ఆయన శనివారం పరిశీలించారు. బిపిటి-5204 'ఎ' గ్రేడ్ ధాన్యం రకానికి ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ.1740 ధర, సాధారణ రకమైతే రూ.1720 ప్రకటించిందని చెప్పారు. కొచ్చర్లలో 400 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుండి మిల్లర్లు మద్దతు ధరకు కొన్నారన్నారు.

యూజిడికి మళ్లీ డిపిఆర్

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేయాలని నిర్ణయించారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే సరికి కనీసం ఐదారు నెలలు అయినా పడుతుందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే నిధులు కేటాయించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

కొత్త అంచనాలతో డిపిఆర్: కేంద్ర మంత్రి చంద్రశేఖర్

రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ఎంత వరకు ఉపయోగపడతాయో తెలుసుకోవాల్సి ఉందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అంటున్నారు. ఇందుకోసం తిరిగి డిపిఆర్ తయారు చేయాలని అధికారులను కోరామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో పాటు కార్పొరేషన్ వాటా కూడా చెల్లించాల్సి ఉందన్నారు. అంచనాలు మారిపోయినందున మళ్లీ డిపిఆర్ రూపొందించక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు.

పథకాల వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

పతి దీదీ , స్వయం సహాయ సంఘాలకు డ్రోన్ల పథకం, పీఎం ఫసల్ బీమా యోజన, యూరియా సబ్సిడీ, న్యూట్రిట్ బేస్డ్ సబ్సిడీ , జాతీయ ఆహార భద్రత పథకం మరియు గరీబ్ కల్యాణ్ అన్నయోజన , పీఎం స్వూర్య ఘర్, కుసుమ్, నేషనల్ గోకుల్ మిషన్, పాల ఉత్పత్తి, గుంటూరు నగరపాలక సంస్థలో తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు, స్థిరాస్తుల ఏర్పాటు, పంట కుంటల నిర్మాణం, పంట కాల్వల పూడీకతీత పనులు ఎక్కువగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జల్ జీవన్ మిషన్‌లో నీటివనరుల అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గతంలో జరిగిన పనుల్లో నాణ్యతను పరిశీలించి నిధుల దుర్వినియోగం జరిగితే చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మించిన లే అవుట్ లలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్ళలోను, లే అవుట్‌లలో నిర్మించిన ఇళ్లలో పూర్తయిన వాటిలో లబ్ధిదారులు నివశించకపోవటంపై అధికారులు కారణాలు విశ్లేషించి నివేదిక అందించాలని ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థలో విలీన గ్రామాలకు పూర్తి స్థాయిలో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించేలా అమృత్-2 పథకం ద్వారా ప్రతిపాదనలు అందించి అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను పూర్తి స్థాయిలో పరిశీలించి పనులు పూర్తయ్యేందుకు మళ్లీ ప్రతిపాదనలు పంపాలన్నారు. పలు అంశాలపై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీకట్లో కటిక నేలపై నిద్ర

(మొదటి పేజీ తరువాయి)

టి.శ్రీనివాసరావు, షేక్ బాబు, చిట్టిమాల ముక్కంటి తదితరులు శనివారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హాస్టల్‌లో కనీస సదుపాయాలేమీ లేవని చెప్పారు. బాత్రుంలు, లెట్రిన్‌లు అధ్వానంగా ఉన్నాయని, పాత భవనం కావడంతో కప్పు పెచ్చులూడుతోందని తెలిపారు. భవనానికి మరమ్మతులు చేయడమో, కొత్త భవనాన్ని నిర్మించడమలో చేయాలని కోరారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు స్టడీ అవర్స్ నిర్వహణకు ట్యూటర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా హాస్టల్‌ను గురజాల ఆర్‌డిఒ మురళి, మాచవరం తహశీల్దార్ క్షమారాణి సందర్శించి విద్యార్థులను సమస్యలడిగారు. తమ ఇబ్బందులు విద్యార్థులు ఏకరువుపెట్టారు. బాత్రూంలు, లైట్లు, ఫ్యాన్లు లేవని, బెడ్లు లేకపోవడంతో నేలపైనే పడుకుంటున్నామని, పాములొస్తాయేమోనని భయంగా ఉందని వాపోయారు. వంట చేసే వ్యక్తి దురుసుగా ప్రవర్తిస్తున్నాడన్నారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ హాస్టల్‌కు నాలుగు నెలల నుండి పూర్తిస్థాయి వార్డెన్ కాకుండా ఇన్‌ఛార్జి వార్డెన్ కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. హాస్టల్‌లో 50 మంది విద్యార్థులున్నారని, వారికి అవసరమైన సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. దాచేపల్లి హాస్టల్‌లో అదనంగా ఉన్న బెడ్లను మోర్జపాడు హాస్టల్‌కు ఇస్తామని చెప్పారు.

కుడికాల్వ, పశ్చిమ డెల్టాకూ ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

తేవాలని ఆకాంక్షించారు. గోదావరి-పెన్నా అనుసంధానాన్ని త్వరలోనే పూర్తి చేసి 9.61 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేస్తామన్నారు. చంద్రబాబు సహకారంతో బొల్లాపల్లి రిజర్వాయర్ కూడా వచ్చి తీరుతుందన్నారు. వరికెపూడిసెల ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు, ఎంపీలంతా సీఎంతో మాట్లాడామని, అది కూడా పూర్తి చేస్తామని చెప్పారు.

కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీకి బాపట్ల జిల్లా అమృతలూరు మండలంలోని కూచిపూడి జలవనరుల కార్యాలయంలో జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా పంతాని మురళీధర్‌రావు (బాపట్ల డిసి-37), వైస్ చైర్మన్‌గా నువ్వుల సునీల్ చౌదరి (చేబ్రోలు డిసి-49) ఏకగ్రీవంగా ఎన్నికయారు. వీరిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, వేమూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, బి.రామాంజనేయులు అభినందించారు. పంట కాల్వల నిర్వహణ ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో నీరందించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పార్థసారథి సూచించారు.

రూ.3 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

(మొదటి పేజీ తరువాయి)

శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్రాంతి లోపు పలు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణ అభివృద్ధి కోసం బృహత్తర ప్రణాళిక సిద్ధం చేయబోతున్నామని, ఇందులో తెనాలి గుంటూరు, విజయవాడ ప్రధాన రహదారులు విస్తరణ, మెరుగైన వైద్య సదుపాయాలు, రక్షితనీటి పథకం ద్వారా నీటి సరఫరా, తెనాలి కళాకారుల సంస్కృతి తదితర అంశాలను ప్రాథమికంగా తీసుకుంటామని వివరించారు. తెనాలి పట్టణ పరిధిలో రోడ్ల విస్తరణతో పాటు సిపి కెమెరాలు ఏర్పాటుపైనా పరిశీలిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లు అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరయ్యాయని, తెనాలి, కొల్లిపర సీసీ రోడ్లు అభివృద్ధి చేయబోతున్నామని అన్నారు. రూ.20 లక్షలతో చినరావూరు పార్క్ మరమ్మతులు చేపట్టి 30 నాటికి సుందరీకరణ చేస్తామన్నారు. రూ 1.15 కోట్లతో తెనాలి ఐతానగర్‌లో ఐకర్స్ పార్క్ నిర్మాణం చేపడతామని, సంక్రాంతిలోపు దుగ్గిరాల, మంగళగిరి కొత్త రోడ్లు పూర్తి చేస్తామని అన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు.. మోడీ చర్యలు..

(మొదటి పేజీ తరువాయి)

జాతులు వేదాలు చదవరాదని, వినరాదని, చదివితే నాలుకలు తెగ్గొయ్యాలని, వింటే చెవుల్లో సీసం పోయాలని చెబుతున్న మనుస్మృతిని తగుల బెట్టిన ఏకైక వ్యక్తి అంబేద్కర్ అని చెప్పారు. అయితే మనువాద భావజాలంతో చేసిన వ్యాఖ్యలకు అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసనల్లో పనిచేస్తున్న బిజెపి విధానాలతో దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. అమిత్ షా రూపంలో వాఖ్యలు, మోడీ రూపంలో చర్యలు ఉంటాయన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కల్పించిన హక్కులు ద్వారా పదవులు పొందిన వారే అంబేద్కర్‌ను అవమానించడం సిగ్గుచేటన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్న బిజెపికి బుద్ధి చెప్పేందుకు వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం పెంచుతామన్నారు. మనుస్మృతి ప్రతులను 25న నరసరావుపేటలోని ధర్నాచౌక్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో దహనం చేస్తామని చెప్పారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జి.మల్లీశ్వరి, డి.శివకుమారి, రెడ్ బాషా, షేక్ అనీమ్ ఖాన్, కె.ఏడుకొండలు, జె.బ్రహ్మయ్య, హరిబాబు, ఏపూరి గోపాలరావు, కె.ఆంజనేయులు, టి.పెద్దిరాజు, కె.కోటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, కె.రామారావు, సిలార్ మసూద్, ఆంజనేయులు, ఆంజనేయరాజు, రంగయ్య, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలపై సరుబాటు చార్జీల పేరుతో భారం మోపడాన్ని నిరశిస్తూ పాత గుంటూరులో సిపియం శాఖ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్, అంకమ్మ గుడి సెంటర్, మణి హెూటల్ సెంటర్లలో



నిరసన తెలియజేస్తున్న సిపియం నాయకులు, ప్రజలు

నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరెంటు బిల్లులపై కరపత్రాలు పంపిణీ చేసి, కరెంటు బిల్లుల ప్రతులు దగ్ధం చేశారు. సిపిఎం నాయకులు ఎల్.అరుణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున విద్యుత్ భారాలను ప్రజలపై మోపిందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో దాదాపు రూ.15వేల కోట్ల భారం మోపారన్నారు. అంతేకాకుండా స్మార్ట్ మీటర్లు బిగిస్తూ వాటికయ్యే ఖర్చు కూడా ప్రజల నుండే వసూలు చేయనున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు పెరుగుతాయని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి నాయకులు ఇప్పుడు అదికారంలోకి వచ్చాక అవే స్మార్ట్ మీటర్లు కొనసాగిస్తున్నారని చెప్పారు. వ్యవసాయం పంప్ సెట్లకు, ఆఫీసుల్లో, షాపుల్లో ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించారని, ఇప్పుడు ఇళ్లల్లో కూడా బిగించటానికి సిద్ధమయ్యారన్నారు. ప్రజలు ఈ స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించకపోతే రానున్న కాలంలో భారాలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రంలో స్థానిక సిపియం శాఖ కార్యదర్శి ఎస్.కార్తీక్, నాయకులు కె.గంగాధరరావు, జె.నాంచారయ్య, ముతా గంగాధరరావు, మురళీకష్ణ, జి.రమణ, ఎం.కష్ణకుమారి, నటరాజ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి :రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీల పెంపుపై సిపిఎం ఆధ్వర్యంలో శనివారం పాత మంగళగిరిలో విద్యుత్ బిల్లులతో నిరసన తెలియజేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పిన టిడిపి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వినియోగదారులపై రూ.18 వేల కోట్ల రుణాలు మోపారని విమర్శించారు. పెంచిన విద్యుత్ బిల్లు లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో సిపిఎం పట్టణ నాయకులు ఎం చలపతి రావు, స్థానిక నాయకులు ఎం రాంబాబు, యు సోమేశ్వరరావు, ఏ సాంబశివరావు, ఏ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో



తాడేపల్లిలో

ప్రజాశక్తి-తాడేపల్లి : తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై ఇబ్బడి మబ్బడిగా వేసిన 1850 కోట్ల రూపాయలు ట్రూ ఆఫ్ చార్జీలు తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఉండవల్లి గుంటూరు ఛానల్ హెడ్ స్లూయిసవద్ద గల పుష్కర కాలనీలో పెంచిన కరెంటు చార్జిన ల్ తగ్గించాలని విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి నేడు మాట తప్పి చార్జీలు పెంచి ప్రజలపై భారం వేసారని విమర్శించారు. పెంచిన చార్జీలు తగ్గించకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టే కరుణాకర్ రావు మాట్లాడుతూ ప్రజలను పీల్చి పిప్పి చేయడానికి పాలకులు మారారు తప్ప విధానాలు ఒకటేనని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం ముగ్గు రోడ్డు శాఖ కార్యదర్శి దర్శనం విజయబాబు, కేఎల్ రావు కాలనీ కార్యదర్శి కట్ట మేరీ, కీర్తి, సోమేశ్వరి, రహితుల్లా తదితరులు పాల్గొన్నారు.



18వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి : తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 18 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎస్ రాజబాబు, ఎస్ పుష్పలీల, వై రమాదేవి, ఈ సారమ్మ, డి నాగమల్లేశ్వరి కూర్చు నారు. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బోరుగ అంకయ్య, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా కార్మికుల సమస్యను పరిష్కరిస్తే వందలాది కుటుంబాలు రుణపడి ఉంటాయని చెప్పారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, యెహెూషువ, భాష, సుభాని, నవనీతం, అన్నమ్మా, దుర్గా భవాని, ఏ నాగేశ్వరరావు, యు రమణ, వి లక్ష్మి, డి రమణ, ఎం గురవయ్య, ఎం శివకుమారి, వై నాగేశ్వరరావు, సాంబయ్య, ఆర్ ఇస్రాయెల్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి, తదితరులు

ముగిసిన 'ఆదర్శ్ 2024' క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కాలేజి ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన 'ఆదర్శ్ 2024-స్పోర్ట్స్ ఫర్ హార్మోని' పేరుతో నిర్వహించిన క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి.ఈ క్రీడాల్లో ఓవరాల్ ఛాంపియన్షిప్‌ను వడ్లమూడి విజ్ఞాన్ లారా కళాశాల కైవశం చేసుకుంది. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్శంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన హిందూ విద్యా సంస్థలలో భాగమైన ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకంగా క్రీడోత్సవాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 65 టీంలు వివిధ పోటీలలో పాల్గొన్నాయని, విజేతలకు రూ.లక్షకు పైగా నగదు బహమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్‌ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బారావు, వైస్‌ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కె.సుస్మిత చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కె రవి, వెలగా అమ్మయ్య పాల్గొన్నారు.

213 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 213 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం నడింపాలెం పంచాయతీ లోని ఎన్ హెచ్ 16 సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న ఆయిల్ గోడౌన్ లో రేషన్ బియ్యం ఉన్నాయని సమాచారం తో దాడులు నిర్వహంచామన్నారు. గోడౌన్‌లో 213 బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యాన్ని గుంటూరు విద్యానగర్ లోని చీమకుర్తి జయ ప్రకాశ్ నారాయణ పౌల్ట్రీ ఫారాలకు అధిక ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుం టున్నాడని తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

బదిలీ పారిశుధ్య కార్మికులను రోజువారీ కార్మికులుగా మార్చాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థలో గత 15, 20 సంవత్సరాలుగా బదిలీ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను రోజువారి మాస్టర్ కార్మికులుగా మార్చాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు కోరారు. శనివారం జిఎంసి అదనపు కమిషనర్ సిహెచ్ ఓబులేష్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ శుక్రవారం జరిగిన జిఎంసి జనరల్‌బాడీ సమావేశంలో 140 మంది పారిశుధ్య కార్మికులను కొత్తగా తీసుకునేందుకు ప్రతిపాదనలు పెట్టారని, ఈ 140ని నగరంలోని వివిధ పారిశుధ్య డివిజన్లలో పనిచేస్తున్న ఆప్కాస్‌లోని బదిలీ కార్మికులతో భర్తీ చేయాలని కోరారు. అలాగే గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు సంవత్సరానికి 15 క్యాజువల్ లీవులు, మహిళా కార్మికులకు అదనంగా మరో 5 రోజుల క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరారు. పార్కులలో పని చేస్తున్న కార్మికులకు ఫేస్ రికగ్నైజ్డ్ సిస్టం (ఎఫ్.ఆర్.ఎస్) కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని



జిఎంసి అదనపు కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విజ్ఞప్తి చేశారు. అదనపు కమిషనర్ సిహెచ్ ఓబులేసు స్పందిస్తూ 140 మంది కార్మికులను బదిలీ కార్మికులతోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ కార్మికులకు క్యాజువల్ లీవులు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఎఫ్ఆర్ఎస్‌లో తలెత్తే సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు యల్లయ్య, మల్లిక, శ్రీలక్ష్మి, మంగ, కోటేశ్వరరావు, వివిధ పారిశుధ్య డివిజన్ల నుండి పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌విఆర్ పూర్వ విద్యార్థుల సమావేశం


హాజరైన పలువురు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థి జీవితంలో మధుర జ్ఞాపకాలను నెమరువేసుకునే ఆత్మీయ సమ్మేళనం, జీవితంలో మరువలేని ఒక అమృత ఘట్టం అని ఆర్‌విఆర్ అండ్ జె.సి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. కళాశాలలో 1995-99 విద్యా సంవత్సరం, వివిధ విద్యా సంవత్సరాలలో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థుల సమావేశం కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కళాశాల పూర్వ విద్యార్థి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, విశిష్ట అథిధులుగా కళాశాల పూర్వపు విద్యార్థులు పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష, యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు.ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ విద్యార్థికి భవిష్యత్తును నిర్ణయించేది కళాశాల వేదికేనని, ఎడ్యుకేషన్. ఇండస్ట్రీతో అనుసంధానం చేసుకొంటూ ఐటి, ఏఐ , ఎమ్ఎల్ వంటి ఆధునిక టెక్నాలజీలలో నూతన పరిశోధనలు జరపాలని సూచించారు. గౌతు శిరీష మాట్లాడుతూ తమకు ఉజ్వల భవిష్యత్తును అందించిన కళాశాలను మరువకూడదని అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కళాశాల యాజమాన్యం, సిబ్బందితో సరదాగా మాట్లా డుతూ వారి యోగ క్షేమాలను తెలుసుకుంటూ, వారి వ్యక్తిగత జీవిత విశేషాలను పంచుకొంటూ, కళాశాల ప్రాంగణంలో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



హాజరైన పూర్వ విద్యార్థులు



నివాళి అర్పిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, తదితరులు

వల్లూరి రాజారత్నంకు పలువురి నివాళి

ప్రజాశక్తి-గుంటూరు: లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ, మానవతా వంటి స్వచ్ఛంద సంస్థలలో చురుకైన కార్యకర్తగా ఉన్న వల్లూరి సదాశివరావు మాతృమూర్తి వల్లూరి రాజారత్నం మృతి చెందారు. ఆమె భౌతిక ఖాయాన్ని శ్రీనగర్‌లోని వారి నివాసంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి లక్ష్మణ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ నూతలపాటి తిరుపతయ్య, దాసరి హనుమంతరావు, మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, అవయవ దాన కమిటీ సమన్వయకర్త గద్దె రత్నశ్రీ, డాక్టర్ సేవ కుమార్, కందిమళ్ల శివప్రసాద్, శివాజీ, ఎండి ప్రసాద్, సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్, ఎల్ భారవి, శివకృష్ణ తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మనిషి మరణానంతరం తమ అవయవాల ద్వారా పదిమందికి జీవితాన్ని ప్రసాదించే వారు మరణించినా జీవించిన వారితో సమానమని అన్నారు. రాజారత్నం మరణానంతరం కుటుంబ సభ్యుల సహకారంతో శంకర నేత్రాలయానికి కళ్ళు, కాటూరి మెడికల్ కళాశాలకు పార్థివ దేహాన్ని దానం చేశారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం.. అంబేద్కర్ నామస్మరణం..



ప్రజాశక్తి - యడ్లపాడు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మీద ఆర్ఎస్ఎస్ భావజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులో అమిత్‌షా దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. సిపిఎం శాఖ కార్యదర్శి బి.పీటర్ మాట్లాడుతూ జాతీయ నాయకులను కించపరిచే వ్యాఖ్యలు సరికాదన్నారు. సీనియర్ నాయకులు ఎన్.కాళిదాసు మాట్లాడుతూ ముందుకు వెళ్తున్న సమాజాన్ని వెనక్కి నెట్టాలని మనువాదులు పన్నాగం పన్నుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో కె.అశోక్, సంజీవరావు, పున్నారావు, కె.చంటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో లక్ష అంబేద్కర్ నామస్మరణ చేపట్టిన ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుండి అంబేద్కర్‌ను పలుమార్లు అవమానపరిచిందని విమర్శించారు. దేశ ప్రజలకు అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.సందీప్, పి.ప్రసాద్, జి.రవికిరణ్, కె.రవి, మారుతి పాల్గొన్నారు.



వీఆర్ఓల వినతి.. ఖాళీల భర్తీకి ఆర్‌డిఒ హామీ..



ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఎలు, నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ కోరారు. ఈ మేరకు నరసరావుపేట ఆర్డీవో కె.మధులతకు శనివారం వినతిపత్రం అందజేశారు. నరసరావుపేట డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్‌వాచ్‌మెన్ పోస్టులను వీఆర్‌ఎలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లతరబడి నియామకాల్లేక ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిపై అదనపు భారం పడుతోందని ఆవేదన వెలిబుచ్చారు. ఆర్డీవో స్పందిస్తూ డివిజన్ పరిధిలో అన్ని మండలాల గ్రామ రెవెన్యూ సహాయకుల సీనియార్టీ జాబితా తన కార్యాలయానికి వచ్చిందని, త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు రఫీ, నాగేశ్వరరావు, కాసులు, శ్రీకాంత్, రవి, మునాఫ్ ఉన్నారు.



డిఎంకు 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు కోరారు. ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేటలోని డిఎం కార్యాలయంలో శనివారం వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోటిరెడ్డి మాట్లాడుతూ 104 విధుల నిర్వహణలో నెలకొన్న ఇబ్బందులు, పెరగని వేతనాలు, అపాయింట్మెంట్ లెటర్‌లు, పిఎఫ్ ఇంక్రిమెంట్‌ల గురించి డిఎం విజయ్‌కుమార్‌కు విన్నవించారు. అరుణ, ఏడుకొండలు, సాంబశివరావు, బాల, కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : విద్యుత్ ఛార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని గాంధీ నగర్‌లో శనివారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సిపిఎం మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నేడు మరో బాదుడు అనే తరహాలో ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించిన వారే నేడు వాటిని అత్యుత్సాహంతో ఏర్పాటు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ విధానాలను మార్చుకోకుంటే మరో విద్యుత్ పోరాటాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.వెంకటేశ్వర్లు, షేక్ బాబు, సయ్యద్ హుస్సేన్, రంజాన్ బి, కాసిం, అల్లాబీ, డి.శ్రీను, రహీం పాల్గొన్నారు.



స్వచ్ఛమైన పౌరసమాజం కోసం బాసట

సామాజిక, సాంస్కృతిక వేదికను ప్రారంభించిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి రజిని, ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి - యడ్లపాడు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న టి.రజిని, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

చైతన్యం ఉన్న గ్రామాల్లో సమాజం అభివృద్ధి, అభ్యున్నతి దిశగా సాగుతుందని, స్వచ్ఛమైన పౌర సమాజం కోసం ఏర్పాటైన 'బాసట' సామాజిక, సాంస్కృతిక వేదిక ప్రస్తుత రోజుల్లో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి టి.రజిని అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులో ఏర్పాటైన 'బాసట' వేదికను స్థానిక పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు వేదిక అధ్యక్షులు ఎన్.కాళిదాసు అధ్యక్షత వహించారు. టి.రజిని మాట్లాడుతూ అందరూ స్వచ్ఛంగానే పుడతారని, కాలం గడిచేకొద్దీ వారిలో మార్పు వస్తుందని చెప్పారు. అందుకే ప్రతిఒక్కరూ చిన్నతనం నుండే విజ్ఞానవంతులయ్యే విధంగా కృషి చేయాలని, శాస్త్రీయ ప్రపంచాన్ని సాధించాలని అన్నారు. ప్రతిఒక్కరి భావాలను గౌరవించాలన్నారు. అందరికీ బాసటలేని ఈ రోజుల్లో 'బాసట' ఏర్పాటు అవసరం ఎంతో ఉందన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లయినా ధనికులు, పేదల మధ్య అంతరాలు ఇంకా పెరుగుతున్నాయని, మనిషి కనీస అవసరాలు తీరడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజలందర్నీ విద్యావంతుల్ని, చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అందుకు 'బాసట' కృషి చేయాలని కోరారు. డాక్టర్ లింగమల్లు మోహనభాస్కరరావు మాట్లాడుతూ యడ్లపాడు, లింగారావుపాలెం యువకులు ఎంతో క్రమశిక్షణతో వైద్యశిబిరం, సేవా కార్యక్రమాలు చేయడం చూశానని, వీటన్నింటినీ ఇకమీదట 'బాసట' వేదిక ద్వారా నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు తన పూర్తి సహకారం, తన భాగస్వామ్యమూ ఉంటుందని చెప్పారు. కళాపోషకులు ఆలోకం పెద్దబ్బాయి మాట్లాడుతూ వైద్యశిబిరాన్ని విస్తరించి ప్రధాన జబ్బులకు వైద్యం అందించాలన్నారు. యడ్లపాడు, మైదవోలు, లింగారావుపాలెం గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. 'బాసట' వేదిక కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'బాసట' అందరికీ బాసట అందించాలని నిర్ణయించుకున్నామన్నారు. అన్ని రంగాల్లోని యువకులను కలుపుకొని సేవకార్యక్రమాలు నిర్వహిస్తామని, శాస్త్రీయ సమాజం కోసం కృషి చేస్తామని చెప్పారు. ఎన్.కాళిదాసు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్, యడ్లపాడు అభివృద్ధి కమిటీ చేస్తున్న ప్రతి కార్యక్రమం సమాజ హితం కోసమేనని వివరించారు. యువజన విద్య, శాస్త్రీయ దృక్పథం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సంస్థలు, వ్యక్తులను కలుపుకుని 'బాసట' సంస్థను ఏర్పాటు చేశామని, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రవీంద్రబాబు, డాక్టర్ పి.అనంతలక్ష్మి, పి.గంగయ్య చౌదరి, ఎన్.నరసింహారావు, డాక్టర్ పి.రమేష్‌బాబు, పి.శ్రీనివాసరావు, కె.బ్రహ్మం, సిహెచ్ సృజన, ఆర్.సుమన్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల సమావేశం

హాజరుకానున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఎన్‌జిఒ కాలనీలో ఉన్న ట్రైనీటాట్స్ కిండర్ జాయ్ స్కూల్‌లో సన్నాహక సమావేశం జరుగుతుందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు. రానున్న ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి లక్ష్మణరావు పోటీ చేస్తున్న దృష్ట్యా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి చర్చిస్తామని పేర్కొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు, సిపిఎం నాయకులు

పేదల భూములపై పెత్తందార్ల పెత్తనం

రుణాలు పొందడంతోపాటు ఖాళీ చేయాలని బెదిరింపులు - రెవెన్యూ సదస్సులో సిపిఎం వినతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మాచవరం మండలం తాడట్ల గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించిన 44 ఎకరాల సొసైటీ భూములను పెత్తందారులు నుండి కాపాడాలని అధికారులకు సిపిఎం విన్నవించింది. మొర్జంపాడు సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన రెవెన్యూ భూ సదస్సులో ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని గోవిందాపురం, తాడట్ల గ్రామాల్లో సర్వేనెంబర్ 345లో పేదల కేటాయించిన 44 ఎకరాల సొసైటీ భూములను పెత్తందారులు పాస్ పుస్తకాలు తెచ్చుకొని, బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారని చెప్పారు. పేదల సాగు చేసుకుంటుండగా ఆ భూములను ఖాళీ చేయాలంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, పేదలకు భూములపై హక్కు కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో చిట్టిమాల ముక్కంటి, షేక్ బాబు, చిట్టిమాల కోటేశ్వరరావు, చిట్టిమాల వీరయ్య ఉన్నారు.

కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేసిన కలెక్టర్, జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతినెలా 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శనివారం పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.





కుంచనపల్లి లో నిరసన



ఉండవల్లిలో నిరసన

రాజ్యాంగ నిర్మాతని అవహేళన చేయడం దుర్మార్గం

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి : సిపిఎం నేత పి.మధు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పార్లమెంటులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరును వ్యంగంగా ఉచ్చరించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని, సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు డిమాండ్ చేశారు. శనివారం గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, మెల్లంపూడి గ్రామంలో సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధు మాట్లాడుతూ బిజెపి మూడవసారి అధికారుల్లోకి వచ్చిన తరువాత దూకుడు పెంచి అరాచక పాలన చేస్తుందని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ, కులాల మధ్య మతాల మధ్య చిచ్చులు పెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో దళితులపైన, మహిళల పైన దాడులు జరుగుతుంటే, ఖండించకపోవడం బిజెపి దిగజారుడుతనానికి నిదర్శనంగా మారిందని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా పరిపాలన చేయాల్సిన బిజెపి రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతని అవహేళన చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా బిజెపి సాగిస్తున్న విధ్వంసాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ, ప్రజాతంత్ర వాదులు నిరసన చేస్తున్నారని ఆయన అన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచి పెట్టేందుకు పరిపాలన చేస్తుందని, ప్రజలందరూ దీన్ని గమనిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే అనేక చట్టాలను మార్పు చేస్తూ, వ్యవసాయ రంగాన్ని, కార్మిక రంగాన్ని నిర్వీరం చేసేందుకు కుట్ర పన్నుతున్న బిజెపిని ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, ప్రతిపక్ష పార్టీ అయినా వైసీపీ ఖండించకపోవడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం మెల్లెం పూడి గ్రామ శాఖ కార్యదర్శి కంచర్ల సాంబశివరావు, అబ్బార్, ప్రేమ్ కుమార్, లాజర్, అప్పారావు, బాబు, ఎస్.కె నాగుల్, ఎస్.కె కరీం, ఈ సతీష్, మస్తాన్, రెహమాన్, వీరబాబు శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరును వ్యంగ్యంగా ఉచ్చరించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు , నాయకులు అమ్మిశెట్టి రామారావు, మహిళా సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కొండపల్లి యశోద, గోపాలం శంకర్రావు, హరీష్, ఏసుదాసు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : దేశంలో అత్యున్నతమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు వస్తుందని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి విమర్శించారు. ఇటీవల పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఉండవల్లి దళితవాడలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దేశంలో మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావడానికి బిజెపి ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, కే శేషయ్య, బి కోటేశ్వరరావు, పి గాంధీ, నాగరాజు, కే సూరిబాబు, సిహెచ్ బాబురావు, కే సాంబశివరావు, అంబేద్కర్ యూత్ పాల్గొన్నారు.

10న అంగన్‌వాడీలు కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి జనవరి 6 నుండి 9వ తేదీ వరకు కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలు, 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ తెలిపారు. శనివారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దీప్తి మనోజ మాట్లాడుతూ నిరాహార దీక్షలకు అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వందల సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏడాదికిపైగా ఖాళీగా ఉన్నా వీటిని భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవట్లేదన్నారు. ఖాళీల భర్తీకి అన్ని జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇస్తున్నారని, గుంటూరు జిల్లాలో మాత్రం పట్టించుకోవట్లేదన్నారు. అదే విధంగా ఖాళీగా ఉన్న వర్కర్ పోస్టులలో ఎంపికైన హెల్పర్లకు ఇంటర్వ్యూలు పూర్తి అయినా ఏడాది కాలంగా కలెక్టర్ ఆమోదం లేక నియామక ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. అనేక సార్లు అధికారులకు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కావున విధిలేని పరిస్థితిలో నిరాహార దీక్షలు, కలెక్టరేట్ ముట్టడికి పూనుకోవాల్సి వచ్చిందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఏబీఎన్ కుమారి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపై ఏడాది క్రితం రాష్ట్రవ్యాప్తంగా నిర్వమించిన 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు సంబంధించి జిఓలు విడుదల చేయాలని కోరారు. అంగన్వాడీల జీతాలు పెంచి ఐదేళ్ల అయ్యిందని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, అంగన్వాడీలలో వితంతువులకు వితంతు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు ఈ రత్న మంజుల, జి ప్రేమలత, టీ రాధ, పి దయమ్మ పాల్గొన్నారు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు ఎవిఎన్ కుమారి

ఉర్దూ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎన్నారై నూకవరపు శ్రీకాంత్ ఆర్థిక సహాయంతో గుంటూరు చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించబడిన స్టడీ మెటీరియల్ శనివారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.డి. ఖాసిం మాట్లాడుతూ తమ పాఠశాలలోని 95 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించినందుకు ఎన్ఆర్ఐ శ్రీకాంత్‌కు, ఎస్ఎఫ్ఐ వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులందరూ ఈస్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించే విధంగా కషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, సమీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందచేస్తున్న హెచ్‌ఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

రాజధాని అభివృద్ధిని స్వాగతిస్తున్నాం..

పేదల ఇళ్లు, చిన్న పరిశ్రమలకు నష్టం లేకుండా రోడ్డేయాలి

ఎర్రబాలెం ఇండస్ట్రీయల్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని అభివృద్ధిలో భాగంగా రోడ్ల అను సంధానం చేస్తూ ఈ 11 రోడ్డు నిర్మాణానికి యర్రబాలెం ఇండస్ట్రియల్ ఓనర్స్ అసోసియేషన్‌గా ఆహ్వానిస్తున్నామని, అయితే రోడ్డు సమస్య సహా స్థానిక సమస్యను పరిష్కరించాలని ప్రధానంగా కోరుతున్నామని అసోసియేషన్ నాయకులు సరికొండ రామరాజు పేర్కొన్నారు. శనివారం మంగళగిరి నియోజకవర్గంలోని యర్రబాలెం ఇండస్ట్రియల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సి ఆర్ డి ఏ ప్లాన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పేదల ఇల్లు చిన్న తరహా పరిశ్రమలు కోల్పోయే పరి స్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రోడ్ల నిర్మాణంలో పేదల ఇల్లు చిన్న తరహా పరిశ్రమలు కోల్పోకుండా ఫారెస్ట్ భూములను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రియల్ ఏరియా లో ఉన్న చిన్న తరహా పరిశ్రమలు బ్యాంకు సబ్సిడీలతో పరిశ్రమలు కొనసాగుతున్నాయని చెప్పారు. రోడ్ల నిర్మాణం పేరుతో పరిశ్రమలను తొలగిస్తే వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి బ్యాంకు ఇఎంఐలు కట్టలేని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిన తిరిగి పరిశ్రమలు నిలబెట్టుకునేందుకు సమయం పడుతుందని బ్యాంకు రుణాలు చెల్లించలేక ఆర్థికంగా పరిశ్రమ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే అద్దెలు బ్యాంకు రుణాలు చెల్లించలేక అనేక పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు సానుకూలంగా ఆలోచించి చిన్న తరహా పరిశ్రమలను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యర్రబాలెం ఇండస్ట్రియల్ ఓనర్స్, రావెల శ్రీనివాసరావు, శ్యాం బాబు, అజయ్ బాబు, షేక్ సలీం, రతన్ లాల్, బహదూర్, బీవీ రెడ్డి, వై వి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.






అమరావతి ఐకాన్లో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

అమరావతి ఐకాన్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లి : గుంటూరు జిల్లా తాడేపల్లిలోని అమరావతి ఐకాన్ అపార్ట్‌మెంట్స్ క్లబ్ హౌస్‌లో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విజయవాడ జోన్ ఫెలోషిప్‌కు చెందిన బండి శ్రీనివాసరెడ్డి (జోసఫ్) క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. తోటివారి పట్ల దయ, ప్రేమ, జాలి గుణాల గురించి క్రీస్తు బోధించారని గుర్తుచేశారు. త్యాగం, సేవకు నిలువెత్తు నిదర్శనం క్రిస్మస్ అని పేర్కొన్నారు. అందువల్ల క్రీస్తును ప్రేమించేవారు సమాజాన్నీ ప్రేమిస్తారని తెలిపారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి, అమరావతి బాలోత్సవం బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలకు చెందిన 26 సాంస్కృతిక పండుగలు ఉన్నాయని, భిన్నత్వంలో ఏకత్వంగా వీటిని ప్రజలంతా జరుపుకుంటున్నారని గుర్తుచేశారు. అమరావతి ఐకాన్లో కూడా అన్ని మతాలకు చెందిన పండుగలు ఐక్యంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు అన్ని అపార్టుమెంట్లలోనూ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పాటలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అమరావతి ఐకాన్ అపార్టుమెంట్‌వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమరావతి ఐకాన్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. గతం నుండి కూడా అమరావతి ఐకాన్లో అన్ని మతాలకు చెందిన పండగులను, మార్చి 8న మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం వంటి మంచి సాంప్రదాయంగా వస్తోంది.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

సెయింట్ ఆన్స్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య.టి అధ్యక్షత వహించగా, ఫాదర్ కిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సిస్టర్ వ్యాకుల, సిస్టర్ ఆవ్‌డేకుల పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక విలువలు, మానవత్వం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ వ్యవస్థాపకురాలు మదర్ జ్ఞానమ్మ 150వ వర్థంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులర్పించారు. ఫాదర్ కిషోర్ క్రీస్తు సందేశం ఇచ్చారు. అనంతరం క్రీస్తు జననం నాటకం ప్రదర్శించారు. విద్యార్థినులకు రంగోలి, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు ఫాదర్ కిషోర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

యలమంచిలి శివాజీకి ఎమ్మెల్యే శిరీష పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం గుంటూరులో మాజీ ఎంపీ ఎలమంచిలి శివాజీని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన శివాజీ నివాసానికి వచ్చి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తన తాత గౌతు లచ్చన్న శివాజీ తో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. తన తండ్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ తో కూడా యలమంచిలి శివాజీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. మూడు తరాలుగా తమ కుటుంబంతో శివాజీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆమె తెలిపారు .

చలికాలం.. వ్యాధులతో భద్రం

- అప్రమత్తతే సరైన వైద్యం
- ప్రముఖ వైద్యులు సింగరాజు సాయికృష్ణ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
ఆస్తమా బాధితులు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సూచన మేరకు వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలని అనన్య హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉందని.. న్యూమోనియా, ఆస్తమా బాధితులు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రధానంగా ఆస్తమా బాధితులు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చలి తీవ్రత వల్ల జలుబు, దగ్గు, గొంతు, నొప్పి, ఫ్లూ జ్వరం, ఆయాసం, ఆస్తమా, సిఒపిడి, అలర్జీ, న్యూమోనియా తదితర శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందని చెప్పారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని.. నిర్లక్ష్యం చేస్తే కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం కావచ్చని తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..
వేడి నీరు తాగడంతో పాటు వెచ్చదనం ఇచ్చే ఉన్నితో తయారు చేసిన దుస్తులు శరీరం పూర్తిగా కప్పేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. చల్లటి పానీయాలు, ఐస్ క్రీమ్ లకు దూరంగా ఉండాలి. ఆస్తమా, గుండె జబ్బు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు చల్లటి ప్రదేశంలో పండుకోవద్దని, వేడి నీటి స్నానం, పొగ మంచు బారిన పడకుండా మాస్కులు ధరించడం, జలుబు, దగ్గు, జ్వరం ఉంటే బయటికి రాకుండా ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకోవడం వంటి జాగ్రత్తలు అవసరమన్నారు. ఏ మాత్రం అస్వస్థతకు గురైనా తక్షణమే వైద్యున్ని సలహా మేరకు చికిత్స పొందడం శ్రేయస్కరమని చెప్పారు.



'కృష్ణవేణి'లో గణిత దినోత్సవం

ప్రజాశక్తి- మాచర్ల
పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి.శేషిరెడ్డి, పాస్టర్ బిషప్ చొట్ట ఐజాక్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీనివాసరామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు గణిత ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, రామకృష్ణ, శ్రీధర్ గుప్తా, సదాశివ రాజు, హరీష్ చంద్ర, స్కూల్ ఇన్చార్జిలు గౌరి, నాగజ్యోతి, శ్రీలక్ష్మీరెడ్డి, బాలా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జీవితంలో గణితం ఒక భాగం

ప్రజాశక్తి-ఈపూరు
జీవితంలో గణితం ఒక భాగమని ఈపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ .రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో పట్టు సాధించడం ద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.ఆంజనేయులు, వై.రాజ్ కుమార్, ఎ.శ్రీనివాసరెడ్డి, కొంగా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం చెక్కుల అందజేత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామ సంగం డెయిరీ పాలక సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, ఈపూరు మండలం చిట్టాపురం పాలకేంద్రం పాలకవర్గ సభ్యులు గంగిరేకుల నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయా కుటుంబాలకు డీవీసీ అభయ సంక్షేమ పథకం కింద ఆర్థిక సహాయం చెక్కులను నరసరావుపేట డైరీ మేనేజర్ కె.నరేంద్ర అందజేశారు. ఇరు కుటుంబాలకు కలిపి రూ.1.30 లక్షలు అందజేసినట్లు చెప్పారు. తమ సంస్థ ఛైర్మన్ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు ఈ మొత్తం అందజేశామన్నారు. డైరెక్టర్ జి.ఆంజనేయులు, మండల ఇన్చార్జి ఎన్.వి.కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి, గోగులపాడు పాల కేంద్రం అధ్యక్షుడు ఆర్.అంకయ్య, సెక్రటరీ కె.శ్రీనివాసరావు, చిట్టాపురం పాల కేంద్రం అధ్యక్షుడు ఎ.చిన్న అంజయ్య, సెక్రటరీ కె.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీ సీపీఎస్ఈఏ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్, విజయపురిసౌత్ :
ఏపీ సీపీఎస్ఈఏ(ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిస్టం ఎంప్లాయిస్ అసోసియేషన్) ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ సాంబేలు శాంతిబాయి ఆధ్వర్యంలో గన్నవరం గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్ర దానం చేపట్టారు. పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో



ప్రధానోపాధ్యాయులు అన్వర్ ఖాన్, కృష్ణ నాయక్, హనుమంతరావు, రాఘవ, లింగం, బ్రహ్మం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమన్వయంతో అభివృద్ధి పనుల నిర్వహణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమన్వయంతో చేపట్టాలని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అన్నారు. రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కె.ఎం.బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి పనులపై వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో చేపడుతున్న సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ బి.నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ గ్రామ సదస్సులను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. కొనకంచివారిపాలెం గ్రామ సర్పంచ్ పొనుగోటి నాసరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలకు మట్టి తరలింపు మిల్లులు మంజూరు చేయాలని కోరారు.

వైసీపీ ఆధ్వర్యంలో జగన్ జన్మదినోత్సవం

ప్రజాశక్తి - యడ్లపాడు
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను యడ్లపాడు మండలం జాలాది గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంటా శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా రాజకీయ రంగంలో జగన్ జైత్రయాత్ర గురించి వివరించారు కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.రాము, జి.రావువయ్య, జరుగుల శేషగిరిరావు, మానం శంకరరావు, ఉర్లగుంట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పుట్టినరోజు వేడుకలు..
దాచేపల్లి : మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించారు. గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి, పల్నాడు హాస్పిటల్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొని, కేకు కోసి పంచిపెట్టారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దివ్యాంగ పాఠశాలలో అక్కడి విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి



కేకు కోస్తున్న వైసీపీ నాయకులు, అభిమానులు

నాయకులు కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాను కోటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం
పిడుగురాళ్ల: పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్ద జగన్ పుట్టిన రోజు వేడుకలు జరిపారు. గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కేకు కట్ చేశారు. సందర్భంగా అన్నదానం చేపట్టారు. నాయకులు చింతలపూడి అశోక్ కుమార్, చింతా రామారావు, చల్లా పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితాలను మార్చేది చదువే..

- హెూలీ ఫ్యామిలీ స్కూల్ 39వ వార్షిక వేడుకల్లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-సత్తెనపల్లి
మన జీవితాలను మార్చేది చదువేనని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. విద్యార్థులకు అద్భుతమైన విజ్ఞానాన్ని అందిస్తున్న పాఠశాల హెూలీ ఫ్యామిలీ స్కూల్ అని కొనియాడారు. శుక్రవారం రాత్రి స్థానిక హెూలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో జరిగిన ఆ పాఠశాల 39వ వార్షిక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సుమారు వందేళ్లుగా విద్యారంగంలో క్రిస్టియన్ మినిస్ట్రీస్ అద్భుతమైన కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రిన్సిపల్ సిస్టర్ విజయ్ రాణి, మున్సిపల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కమిషనర్, సత్తెనపల్లి ఎంఈఓ శ్రీనివాసరావు, సంజీవని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బత్తుల శివరామకృష్ణ తదితరులు మాట్లాడారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.



మండల కార్యాలయంలో చెత్తాచెదారాల తొలగింపు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్
స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బండి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. విస్తరణాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర సిబ్బంది కార్యాలయ ఆవరణంలోని పనికిరాని మొక్కలను, చెత్తను శనివారం తొలగించారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి - దాచేపల్లి
మండలంలోని కేసానుపల్లి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సులను తహసీల్దారు కుటుంబరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్, వీఆర్‌ఓ రమేష్, మీసాల బాబు, టిడిపి సీనియర్ నాయకులు నెల్లూరి రామకోటయ్య, కార్యదర్శి స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 72 అర్జీలు
అచ్చంపేట : అచ్చంపేటలోని సచివాలయం 1, 2 పరిధిలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 72 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. డీకే పట్టాలు, చుక్కల భూములు, డొంక రోడ్ల ఆక్రమణ, సర్వే నంబర్లలో తేడాలు ఉన్నాయంటూ పలువురు రైతులు వినతులు సమర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ షేక్ ఖాజావలి, సర్వేయర్ యు.ఏడుకొండలు, వీఆర్వో బాల నాయక్, టిడిపి నాయకులు టి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారులకు భూమిపూజ

ప్రజాశక్తి - విజయపురిసౌత్
మాచర్ల మండలం బ్రహ్మానందపురం తండా గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రహదారుల నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వీరాస్వామి, రామిశెట్టి సైదారావు, జనసేన



మండల అధ్యక్షుడు సాంబశివరావు, గుమ్మా వెంకటేశ్వర్లు, రవి నాయక్, దోనెపాటి అంజయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు

ప్రజాశక్తి-అచ్చంపేట
పలువురు పేదలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం అందజేశారు. నియోజక వర్గంలోని ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.5,69,736లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం : డిజిపి

ప్రజాశక్తి- ఎఎన్‌యు

సమాజ వికాసం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని.. అందుకు తగినట్లుగా నేటితరం విద్యార్థులు అడుగులు వేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) సి.హెచ్ .ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్, సైబర్‌టాక్, డ్రగ్స్ ముప్పు వంటివాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలిసీతెలియని వయసులో విద్యార్థులు, యువత చెడు వ్యసనాల వైపు పయనించడం బాధాకరమన్నారు. డిజిటల్ యుగంలో అప్రమత్తత అవసరమన్నారు. విద్యార్థులు తమతోపాటు, సమాజాన్ని రక్షించుకోవడానికి బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవాలని కోరారు. ఇన్చార్జి వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతల ప్రాముఖ్యతను, భవిష్యత్తును రూపొందించడంలో వాటి పరివర్తన పాత్రను వివరించారు. విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అన్వేషించాలని, సాంకేతిక పురోగతికి సహకరించాలని ప్రోత్సహించారు. విద్యార్థులకు అవసరమైన స్కిల్ ఓరియెంటెడ్ కార్యక్రమాలను, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ తరగతులను, ఉద్యోగాలు పొందేందుకు క్యాంపస్ డ్రైవ్ ను నిరంతరం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇన్చార్జి రెక్టార్ ఆచార్య రత్న షీలామణి మాట్లాడుతూ సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. వాస్తవ ప్రపంచ సవాళ్లను



ఎదుర్కోవడానికి చొరవ చూపాలన్నారు. ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు విద్యావిషయక సాధనలు, వ్యక్తిగత ఎదుగుదల మధ్య సమతుల్యతను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి ప్రసంగించారు.



స్కేటర్ జెస్సీరాజ్‌కు పీఎం రాష్ట్రీయ బాల పురస్కారం

ప్రజాశక్తి-మంగళగిరి

అంతర్జాతీయ స్కేటింగ్ వేదికపై అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి, క్రీడా ప్రముఖుల మన్ననలు పొందిన మంగళగిరికి చెందిన క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి రాష్ట్రీ బాల పురస్కార్-2025కు ఎంపికైంది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకోనుంది. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌ను ప్రతి ఏటా దేశంలోని 25 మంది చిన్నారులకు కేంద్రం అందిస్తుంది.వివిధ అంశాల్లో విభిన్న ప్రతిభ చూపిన బాలలను జ్యూరీ పారదర్శకంగా ఈ పురస్కారానికి ఎంపిక చేస్తుంది. 2025 పురస్కారానికి సంబంధించిన జాబితాను ఈ నెల 17వ తేదీన కేంద్ర ప్రభుత్వ స్త్రీ, శిశుసంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. క్రీడా విభాగంలో జెస్సీరాజ్ పేరును కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ ఎన్ఎస్ఎం స్కూల్‌లో జెస్సీరాజ్ తొమ్మిదో తరగతి చదువుతోంది. కేంద్ర పురస్కారానికి ఎంపికైన జెస్సీరాజ్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు మాత్రపు సురేష్, రాధ మాట్లాడుతూ.. కేంద్ర బాల పురస్కార్‌కు జెస్సీరాజ్‌ను ఎంపిక చేయాలని మంత్రి నారా లోకేష్ సిఫారసుల మేరకే ఈ గౌరవం లభించిందని చెప్పారు. మంత్రి లోకేష్‌కు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి చేబ్రోలు

ప్రజలుకు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మండలంలోని పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. చేబ్రోలు డిగ్రీ కాలేజీ ఎదురు రోడ్డులో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కత్తెర సురేష్, కూచిపూడి రవి శేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్య కారణంతో బాధపడుతున్న చేబ్రోలు ఎంపీటీసీ 1 పటాన్ ఇర్ఫాన్‌ను పరామర్శించారు. గరువుపాలెంలోని శ్రీ దుర్గా సిద్ధేశ్వర పంచాయతన మణికంఠ క్షేత్రము (శక్తిపీఠం)మూడవ వార్షికోత్సవం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గరువుపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తైదల వెంకటేశ్వర్లు కుమారుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు, వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పురపాలక సంఘంలో దిగువస్థాయి ఉద్యోగులకు తెనాలి మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న తదితరులు పాల్గొన్నారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శాశ్వత పారిశుధ్య కార్మికులకు, డ్రైవర్లకు, అటెండర్లకు మొత్తం 143 మందికి నూతన వస్త్రాలను అందజేశారు.





వీఐటీలో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని వీఐటీ విశ్వవిద్యాలయంలో వాటర్ అండ్ ఎనర్జీ సొల్యూషన్స్ - నెక్స్ట్ జనరేషన్ సస్టైనబుల్ మెటీరియల్స్ అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. నీరు, శక్తికి సంబంధించిన అత్యవసర సవాళ్లను చర్చించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత పరిశోధకులు, విద్యావేత్తలను ఒకచోట చేర్చడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ఆచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్, ముత్తు ప్రభు, సచిలన్ శర్మ, ఇల్లా రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు

➤ రెవెన్యూ సదస్సులో సీపీఎం వినతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గత ప్రభుత్వం రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిందని.. నేడు కూటమి ప్రభుత్వం ఆ భూములను ఇళ్ల స్థలాలుగా ఇవ్వడం కుదరదంటూ రద్దు చేసిందని సీపీఎం నాయకులు తెలిపారు. ఆ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు ప్రస్తుతం నివసించే ఆత్మకూరు గ్రామంలోనే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం గ్రామ రెవెన్యూ సదస్సులో సిపిఎం ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. దళితుల కోసం శ్మశాన వాటిక, పేదల పట్టాలు, రాజధానిలో ఇచ్చిన ఇంటి ప్లాట్లు, ఇళ్లస్థలాలపై అర్జీలను అందించారు. 199 సర్వే నెంబర్‌లో భూమిని సబ్ డివిజన్ చేసిన సందర్భంలో సాగుభూమిగా బీఫారం ఇచ్చారని వివరించారు. దానిని 18 సంవత్సరాల క్రితం నివాసాలకు అనుకూలంగా ఉందని.. గ్రామంలోని పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. ఆ ఇళ్లకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలతో పాటు ఇంటి పన్ను కూడా కల్పించాలని కోరారు.



గ్రామంలో అనేక మంది పేదలు ఇళ్ల స్థలాలు, వివిధ భూసమస్యలపై రెవెన్యూ అధికారులకు అర్జీలు అందించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, నాయకులు పండల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గడ్డం అజయ్ కుమార్, చేనేత కార్మిక సంఘం నాయకులు సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-దుగ్గిరాల

క్రిస్మస్ పర్వదినం నేపథ్యంలో బేతేలు ఇవాంజలికల్ మిషన్(కర్లపాలెం) సహకారంతో మండలంలోని మోరంపూడి వద్దనున్న గ్రేట నాల్ టెస్ సంస్థలో శనివారం 30 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. సంస్థ అధినేత పాస్టర్ యేసు బాబు, గ్రేట నాల్ టెస్ కరస్పాండెంట్ వంగర ఉదయార్క, ప్రిన్సిపల్ రవి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మాజీ సీఎం జగన్ జన్మదినోత్సవం

సేవా కార్యక్రమాలు చేపట్టిన వైసీపీ శ్రేణులు

ప్రజాశక్తి-మంగళగిరి

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వందమంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జిల్లా నాయకులు ఎం.సుధారాణి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

మాజీ సీఎం జగన్ జన్మదిన సందర్భంగా మంగళగిరి పట్టణంలోని రామనాథం చినకోటయ్య, శివపార్వతమ్మ వృద్ధుల ఆశ్రమంలో కొసనం విఠప్ప, రుద్ర పశుపతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు, ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు, సమన్వయకర్త డి.వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

తుళ్లూరు : తుళ్లూరు, దొండపాడు తదితర గ్రామాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి జగన్ వేడుకలను నిర్వహించారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు), కార్యకర్తలు దొండపాడులో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతర జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. తుళ్లూరులోని తులసీ థియేటర్, ఎస్సి కాలనీలో వేడుకలు జరిగాయి.

ఆలయాల్లో పూజలు

చేబ్రోలు : జగన్ పుట్టిన రోజు సందర్భంగా అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో చేబ్రోలులోని కొత్త రెడ్డిపాలెం వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. జగన్‌కు స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించినట్లు చెప్పారు. అనంతరం కేక్ కట్ చేశారు.

కుంచనపల్లిలో ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

తాడేపల్లి రూరల్ : మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదినోత్సవాన్ని ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.





జన్మదినోత్సవ కేకును వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా వెంకట శివ నాగేశ్వరరావు కట్ చేశారు. అనంతరం వైఎఆర్సీపీ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల నాయకులు పి..బండ్ల కృష్ణమూర్తి, కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు, నాయకులు కమ్మిశెట్టి శివ నాగేశ్వరరావు, గడ్డం తాతారావు, చాగంటి వెంకటరెడ్డి, బి.విజయేందర్ రావు, సిహెచ్ విజయేందర్ రెడ్డి, కూరపాటి సాంబిరెడ్డి, నల్లపు ప్రదీప్, నల్లపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు : గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని వివిధ పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. మ్యాథ్స్ ఎక్స్‌పోలు నిర్వహించారు.



భాష్యం బ్లూమ్స్‌లో..

స్థానిక భాష్యం బ్లూమ్స్ విబిసి క్యాంపస్‌లో గణిత శాస్త్ర పితామహుడు డాక్టర్ శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా విద్యార్థులకు స్టీమ్ ఎక్స్‌పో పేరుతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పాథాలజీ డాక్టర్ స్వతంత్ర్య హాజరై మాట్లాడారు. భాష్యం మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ విద్యార్థుల నమూనాలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో బ్లూమ్స్ జెడ్‌ఈఒ వరలక్ష్మి, సెకండరీ ప్రిన్సిపాల్ గిరిజారాణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కవిత పర్యవేక్షించారు.



కెఎల్‌పి స్కూల్లో..

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. గణిత శాస్త్రవేత్తల చిత్రపటాలతో గణిత సూత్రాలతో కూడిన చార్ట్‌లతో అలంకరించారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, జెకెసి కాలేజి ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ కె.సాంబశివరావు, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య తదితరులు పాల్గొని రామానుజన్ చిత్రపటానికి పూలుమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత నమూనాలను అతిథులు పరిశీలించి, విద్యార్థులను అభినందించారు.



గీతాంజలి హైస్కూల్లో...

స్థానిక ఏటిఅగ్రహారం, రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో శనివారం గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ షేక్.హుస్సేన్ మాట్లాడుతూ రామానుజన్ గొప్పదనాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితం డయాగ్రమ్స్ బొమ్మలుగా తయారుచేసి పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ షేక్.షంషాద్‌భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రజ్ఞ స్కూల్లో..

స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ మెడీ టెక్నో పాఠశాలలో శనివారం గణిత శాస్త్ర మేధావి డాక్టర్ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు స్పీడ్ మాథెమాటిక్స్‌పై పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్స్, మెడల్స్ అందించారు.విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు ప్రసంగించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీమున్, సలీం, మస్తాన్రావు, సుధారాణి జరిన, సౌభాగ్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సుమేధా స్కూల్లో..

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీ సుమేధా హైస్కూల్లో మ్యాథ్స్‌డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల మ్యాథ్స్ ప్రాజెక్ట్‌లు, వివిధ రకాల నృత్య ప్రదర్శనలతో మ్యాథ్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గణితం అభివృద్ధికి రామానుజన్ చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







వివిఐటిలో యువజనోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా- వివిఐటి 2024-25 వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిఐటి కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. ది వరల్డ్ ఈజ్ వన్ నేపద్యాన్ని ప్రతి బింబించేలా కళాశాల ప్రాంగణం మొత్తం ప్రపంచ దేశాలలోని సంస్కృతులు, ఆచారాలు, ఆకృతులతో తీర్చిదిద్దారు. సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా మూడు విభాగాల నుండి 94 అంశాలలో పోటీలు నిర్వహించగా వివిధ కళాశాలకు చెందిన 4500 మంది విద్యార్థులు ఈపోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు ముగింపు కార్యక్రమములో అతిధులుగా వివిఐటి కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపాల్ పాతూరి రాధిక, జాన్సన్ అండ్ జాన్సన్ ఐటి మేనేజర్ ఆదిశేషారెడ్డి, అమెరికన్ ప్రొఫెసర్ దండు రాజు పాల్గొన్నారు. విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపాల్ పాతూరి రాధిక మాట్లడుతూ యువజనోత్సవాలు విద్యార్థులలో నాయకత్వ, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. వివిఐటి కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న ఈ



వేడుకలలో విద్యార్థులు అహ్లాదకరంగా పాల్గొనాలని, వివా వివిఐటి ద్వారా విద్యార్థులు మంచి అనుభూతులను దక్కించుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిలోని సజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. తొలిరోజు పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలను అందచేసారు. వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై. మల్లిఖార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్. కుమారస్వామి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

టిజెపిఎస్‌లో ఖోఖో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాలలో ఆచార్య నాగార్జునా యూని వర్సిటీ పరిధిలో ఖో-ఖో పురుషుల అంతర కళాశాలల పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిదిగా హాజరైన వాసవి విద్యానిదికమిటీ అధ్యక్షులు పొట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా జ్ఞానం క్రీడల వలన కలుగుతుందని చెప్పారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం వంటివి అలవాడతాయన్నారు. యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి.పి.సత్యపాల్‌కుమార్ మాట్లాడుతూ జీవితంలో త్వరగా స్థిరపడే అవకాశాన్ని క్రీడలు కలిగిస్తాయని, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా రిజర్వేషన్ పెంచినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ పరిధిలోని వివిధ కాలేజిల నుండి ఖోఖో జట్లు పాల్గొన్నట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి, ట్రెజరర్ వి.కష్ణానంద్, శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకష్ణ డిఎస్‌డిఒ పి.నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

రేపు పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందన సభ

ప్రజాశక్తి-గుంటూరు



అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయనకు ఈనెల 23వ తేదీ, సోమవారం సాయంత్రం 6 గంటలకు బ్రాడీ పేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో అభినందన సభ నిర్వహిస్తున్నట్లు జాషువా విజ్ఞానకేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ పాల్గొంటారన్నారు. లక్ష్మీ నారాయణ సమాజ పురోభివృద్ధికి అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి కృషి చేశారన్నారు. నేటి సామాజిక, ఆర్థిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఆయనకు అందజేయడం అభినందనీయమన్నారు. సభలో కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు, అభ్యుదయ వాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అమరావతి అభివృద్ధిలో పెరిగిన వేగం

వీక్షణం

దాదాపు ఐదేళ్ల తరువాత రాజధాని అమరావతికి కళ వచ్చింది. 2019కి ముందే చేపట్టిన నిర్మాణాలను పూర్తిచేయడంతో పాటు కొత్తగా శాశ్వత ప్రాతిపదికన సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసే పనిలో ఉంది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈసారి తొలి ప్రాధాన్యం అమరావతికే కేటాయిస్తున్నారు. సిఎం చంద్రబాబు నాయుడు వారం, పది రోజులకు ఒక సారి సమీక్ష చేస్తున్నారు. ఇటీవల జరిగిన సిఆర్‌డిఏ అథారిటీ 43వ సమావేశంలో శాశ్వత నిర్మాణాలపై పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. గత ఆరు నెలలు కాలంలో సిఆర్‌డిఏ భూములలోల గత ఐదేళ్లుగా పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్సును తొలగించే పనిని ఇటీవల పూర్తి చేశారు. సిఎం సమీక్షలతో పాటు మునిసిపల్ మంత్రి పి.నారాయణ పూర్తి సమయం రాజధాని నిర్మాణంకే కేటాయిస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో మూడు రాజధానుల నినాదంతో అమరావతిని నిర్వీర్యం చేశారు. వైసిపి తప్ప మిగతా అన్నిపార్టీలు అమరావతికే తమ మద్ధతు తెలియజేశాయి. ఇటీవల గుంటూరులో జరిగిన సిపిఎం జిల్లా మహాసభలో రాజధాని నిర్మాణం అమరావతిలోనే చేయాలని తీర్మానించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అప్పుగా కాకుండా గ్రాంటుగా నిధులు ఇవ్వాలని తీర్మానంలో కోరారు. ప్రస్తుతం సోమవారం నుంచి పలు నిర్మాణాలకు టెండర్లు పిలవనున్నారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు శాశ్వత భవనాల నిర్మాణంతో పాటు రాజధాని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ట్రంక్ రోడ్లు, లేఅవుట్‌లు, ఐకానిక్ భవనాల నిర్మాణాలకు రూ.24,276 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఈమేరకు టెండర్లను ఈ నెలాఖరుకు కల్లా ఖరారు చేయాలని నిర్ణయించారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు, ఇతర భవనాలను శాశ్వత ప్రాతిపదికన నిర్మించేందుకు అంచనాలను రూపొందించారు. అసెంబ్లీని 103 ఎకరాల్లో, 250 మీటర్ల ఎత్తులో 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు లేని మిగతా రోజుల్లో ప్రజలు అసెంబ్లీ భవనంపైనుంచి రాజధానిని తిలకించే అవకాశం ప్రజలకు కల్పిస్తారు. హైకోర్టు భవనాన్ని 20.32 లక్షల చదరపు అడుగులు, 42 ఎకరాల్లో 55 మీటర్ల ఎత్తున 8 అంతస్తుల్లో రూ.1048 కోట్లతో నిర్మించనున్నారు. సచివాలయంను 17.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 47 అంతస్తులతో నిర్మించనున్నట్లు చెప్పారు. దీంతోపాటు మొత్తం 5 టవర్లతో కూడిన వివిధ భవనాలు 68.88 లక్షల చదరపు అడుగులలో రూ.4,688 కోట్లతో నిర్మించనున్నారు. వీటితో పాటు రైతులకు కేటాయించిన లే అవుట్లలో కూడామౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. వచ్చే మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే నిర్ధేశిత లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తికాకపోతే మళ్లీ ఇబ్బందులు వస్తాయోమోనని రైతులు, టిడిపి నాయకులు కొంత సందేహాలు లేకపోలేదు. యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు జరగాలని రాజధాని రైతులు ఆశిస్తున్నారు. అంతేగాక రైతులకు సంబంధి ంచి నిర్మించనున్న లే అవుట్ల మౌలిక సదుపాయాలు త్వరితగతిన కల్పించి త్వరగా రిటర్న్ బుల్ ప్లాట్‌లకు సంబంధించిన భూములను రైతులకు ఫిజికల్ అప్పగించ కలిగితే తమకు పూర్తిస్థాయిలో సంతృప్తి కలుగుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. రాజధానికి భూములు ఇచ్చి 10 ఏళ్లు పూర్తయిందని ఇంత వరకు వాటి ఫలితాలను పొందలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు. కొన్ని ఇబ్బందులు వచ్చినా కౌలు పరిహారం తప్ప మిగతా సౌలభ్యాలు ఏమీ అందలేదని రైతులు చెబు తున్నారు. రైతులకు పాట్లకు సంబం ధించిన స్థలాలను అప్పగించి వాటిల్లో నిర్మాణాలకు అవకాశాలు కల్పిస్తేనే రాజధానికి పూర్తి స్థాయిలో వైభవం వస్తుందని అధికారులు కూడా అంగీకరి స్తున్నారు.

(ఎ.వి.డి.శర్మ)